విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 1,ఆగస్టు 2025

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కండి

- భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న మోడీని గద్దె దింపుదాం
- ఏడాది కిందటి చంద్రబాబు ఇప్పుడు మారిపోయాడు
- రాప్తాడు నియోజకవర్గ సిపిఐ మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూలదోసి స్వతంత్ర భారత దేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న ఎన్డీఏ ప్రభుత్వం నుండి దేశాన్ని కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర పోరాటం చేయాల్సి వస్తుందని దీనికి దేశ ప్రజలంతా సిద్ధంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ సిపిఐ 6వ మహాసభలు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షతన జరిగాయి. మహాసభ కంటే ముందు జరిగిన మహా ప్రదర్శన గ్రామ ప్రజలను బాగా ఆకట్టుకుంది. ఈ మహా సభకు ముఖ్య అతిథిగా హాజరై రామకృష్ణ మాట్లాడుతూ వందేళ్ల కిందట దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యం రాజ్యమేలుతున్న సందర్భంలో వారికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ, జాతీయ కాంగ్రెస్ ఈ రెండు పార్టీలే ఉద్యమం చేసి స్వాతంత్రాన్ని తెచ్చిపెట్టాయని గుర్తు చేశారు. దోపిడీకి, దుర్మార్గానికి వ్యతిరేకంగా ఎంతో మంది మహనీయులు జైలు పాలయ్యారని గాంధీ నాయకత్వంలో జరిగిన పోరాటాలకు జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు నాయకత్వం వహించాయని చెప్పారు. ఇలాంటి భారత దేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కారణంగా ప్రజాస్వామ్యం లౌకిక, కులాలు, మతాలు సమన్వయంతో ముందుకెళ్తుంటే 11 ఏళ్ల కిందట అధికారంలోకి వచ్చిన మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అంచలంచెలుగా వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఇటీవల పాకిస్తాన్‌కు ఇండియాకు జరిగిన యుద్ధాన్ని తామే ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తే కనీసం దాన్ని దేశ ప్రధాని మోడీ ఖండించిన పాపాన పోలేదని మండిపడ్డారు. 146 కోట్ల జనాభా కలిగిన భారతదేశాన్ని ఏ ఒక్క దేశం కూడా శాసించే స్థాయిలో లేదని అలాంటిది అగ్రదేశానికి మోడీ మోకరిల్లాడని దుయ్యబట్టారు. దేశ ప్రధానులుగా ఇందిరా గాంధీ నెహ్రూ, మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో ఏ దేశం కూడా భారతదేశాన్ని శాసించలేదని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో ట్రంప్ మన దేశాన్ని తక్కువ చేసి మాట్లాడటంతో ప్రపంచ దేశాల్లో భారతదేశం మర్యాద దిగజారిందని ఆవేదన చెందారు. భారత దేశంలో పేదరికం, ధరల పెరుగుదల, అవినీతి రాజ్యమేలుతుంటే మోడీ అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, రైతుల ఆత్మహత్యలకు ఫుల్ స్టాప్ పెట్టడానికి ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేశంలో 55 శాతం రైతులు తమ ఆస్తులను బ్యాంకుల్లో, సొసైటీలో తాకట్టు పెట్టి అప్పులు చేసుకున్నారని వారందరూ గిట్టుబాటు ధరలేక ఆత్మహత్యల బాటపడుతున్నారన్నారు. నాలుగు నెలలకు ఒకసారి ఢిల్లీకి వెళ్తున్న చంద్రబాబు రైతులను ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఒక్క రాగి పైసా కూడా తేలేదన్నారు. రైతులకు ప్రకటించిన 20వేలు ఆర్థిక సహాయం ఇంతవరకు అందించలేదని రైతులను బిక్షగాలుగా మారుస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఒక శాతం ఉన్న వర్గాలకు 40 శాతం సంపద చేరిపోతుందని , మిగిలిన వారంతా పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన చెందారు.

చంద్రబాబుది వంకర బుద్ధి

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు రైతులు, కార్మికులు, కర్షకులు, పేదలు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తారని అధికారంలోకి రాగానే అవన్నీ మర్చిపోయి కార్పొరేట్ శక్తులకు అదాని, అంబానీలకు వంత పాడుతాడని రామకృష్ణ ఆరోపించారు. 20 మంది ఎంపీలు , 164 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన రైతాంగాన్ని నట్టేట ముంచాడని, సింగపూర్ అంటూ పర్యటనలు చేస్తూ అభివృద్ధిని సాకుగా చూపి రాష్ట్ర బాగోగులు గాలికి వదిలేసారని ఆరోపించారు. కర్నూలు అనంతపురం, చిత్తూరు కడప జిల్లాలో పండుతున్న టమోటా , మామిడి వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతుంటే పట్టనట్లు వ్యవహరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. విజయవాడలో కోట్ల విలువైన ఆర్టీసీ స్థలాలను లులు కంపెనీకి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అమరావతిలో 54 వేల ఎకరాలు చంద్రబాబు తన దగ్గర ఉంచుకున్నప్పటికీ ఇంకా భూదాహం తగ్గలేదని 40వేల ఎకరాలు కావాలని ప్రకటన చేస్తున్నడం హాస్యాస్పదమన్నారు.5 వేల ఎకరాల్లో విమానాశ్రయం, 15 ఎకరాలతో రైల్వే స్టేషన్ నిర్మిస్తానని చంద్రబాబు ప్రకటించడానికి తప్పు పట్టారు. దీన్ని వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు ఆలోచన విధానంలో మార్పు రాదని జనమే ఆయన్ని మార్చాలని సూచించారు. మహిళలకు నెలనెలా రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ అందించక పోవడం బాధాకరమన్నారు . సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేదాకా పోరాటాలు చేద్దామన్నారు . ఆంధ్రప్రదేశు అప్పులకుప్పగా మార్చి ఏడాది కాలంలో రూ. లక్షా 70వేల కోట్లు అప్పు తీసుకురావడం ఎందుకు ఉదాహరణ అన్నారు కరెంటు చార్జీలు పెంచపోమంటూ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపుతున్నారని గుర్తు చేశారు. విద్యుత్ చార్జీల భారంపై ఈనెల ఐదున విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహిస్తున్నామని ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు . దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాల తర్వాత కూడా ఇప్పటికీ పేదరికంలో ఉన్నారని పక్కా ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకోవడం ప్రభుత్వాలకు సిగ్గుచేటుగా లేదా అని ప్రశ్నించారు చంద్రబాబుకు ఈ ఏడాది పాలనలో ప్రజలు జీరో మార్కులు వేశారని గుర్తు చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు సాగునీరు తాగునీరు కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేసిందని గుర్తు చేశారు.కుడికాలువ, హంద్రీనీవా ద్వారా రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సాగునీళ్లు ఇవ్వడానికి అవకాశం ఉందని దీనికోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా ఈ విషయములో రైతాంగ సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని జగదీష్ సూచించారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి సి. జాఫర్, సహాయ కార్యదర్శిలు పాళ్యం నారాయణస్వామి, చిరుతల మల్లికార్జునలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు జె. రాజారెడ్డి, ఎన్.శ్రీరాములు, బి.కేశవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ. పద్మావతి, సి.లింగమయ్య, బి.రమణయ్య, రాజేష్, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.కుల్లాయి స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండల కార్యదర్శిలు రమేష్, రవీంద్ర, నీళ్లపాల రామకృష్ణ, రూరల్ మండల సహాయ కార్యదర్శి నరేష్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి వంశీ, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, ఏఐటియుసి ఆటో యూనియన్ నాయకులు రాజు, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

25వ సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి..

విశాలాంధ్ర-యాడికి : ఆగస్టు 12, 13వ తేదీలలో అనంతపురంలో నిర్వహించనున్న 25వ జిల్లా మహాసభలకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ అధ్యక్షతన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటరాముడు యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ నివాసంలో సిపిఐ పార్టీ నాయకులు గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వెంకట రాముడు యాదవ్, జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల క్రితమే భారతీయులను బ్రిటీష్ బానిసత్వం నుండి విముక్తి కలిగించాలని, కుల వివక్ష, మతం, మూఢ విశ్వాసాలను, నిరక్షరాస్యతను పారదోలేందుకు వీరోచిత పోరాటాలు చేసిందన్నారు. ప్రజాహిత చట్టాలైన భూసంస్కరణ చట్టం, రాజాభరణాల రద్దు, వెట్టిచాకిరి విముక్తి, జమీందారీ, జాగీర్దారి విధానాల రద్దు, బ్యాంకుల జాతీయం, ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు లాంటి అనేక చట్టాలు రావడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. సిపిఐ, సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి నిజాం నవాబుల దుష్ట పాలన నుండి తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి చేసి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. జిల్లాలో కరువు నివారణ, సాగునీరు, తాగునీటి సాధన కోసం అనేక నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, సమాన వేతనం, కనీస వేతనాలు, శాశ్వత పని ఉన్నచోట శాశ్వత ఉద్యోగాల కల్పన, పంటలకు గిట్టుబాటు ధరలకు ప్రత్యేక చట్టం, వ్యవసాయ రుణాల రద్దు, మహిళా సాధికారత, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాల నిర్మూలన, విద్యారంగ సమస్యల పరిష్కారం, నిరుద్యోగ భృతిపై విశ్రాంతిలేని పోరాటం చేస్తున్నదన్నారు. సిపిఐ, జాతీయ మహాసభలు సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు చండీగర్‌లో, రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న నేపథ్యంలో భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకొని ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీసేందుకు, సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఓబిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి వడ్డెరాముడు, చేనేత మండల కార్యదర్శి బండారు రాఘవ, సిపిఐ నాయకులు గరిడి శివన్న నబి రసూల్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

సీపీఐ నియోజవర్గ కార్యదర్శి గోపాల్..

విశాలాంధ్ర- కళ్యాణదుర్గం: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు విమర్శించారు. గురువారం సెట్టూరులో గ్రామ మహాసభల సందర్భంగా సీనియర్ నాయకులు పంపాపతి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన శాఖ మహాసభకు మండల కార్యదర్శి జయరాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్యులర్, సౌమ్యవాద పదాలు బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం నుండి తొలగిస్తామని చెప్పడం దుర్మార్గం అన్నారు. సెక్యులర్ సౌమ్య వాద పదాలను ఎవరూ తొలగించలేరని అన్నారు. రైతులకు ప్రభుత్వం ఇంతవరకు ఏమీ చేసింది లేదన్నారు. అన్నదాత సుఖీభవ డబ్బులను రైతు ఖాతాలో తక్షణం జమ చేయాలని డిమాండ్ చేశారు. తొలి అడుగులో ప్రజా ప్రతినిధులకు రోడ్ల దుస్థితి కనిపించలేదా అని అన్నారు. సెట్టూరు, కైరవు రోడ్డును తక్షణమే వేయాలన్నారు. దళిత గిరిజనులపై దాడులు, పోలీస్ బెదిరింపులు ఆపాలని అన్నారు. ఆగస్టు 12, 13 జరుగు జిల్లా మహాసభలను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పర సీనప్ప, జయరాములు, కృష్ణ, విశ్వనాథ రెడ్డి, నరసింహులు ఆంజనేయులు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు

సంకల్పం బలంతోనే విజయాలు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : మనసులో సంకల్పం బలంగా ఉంటే విజయాలను సొంతం చేసుకోవచ్చని.. చదువుకున్న కళాశాలలోనే ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ .. పదోన్నతి సాధించి. జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా దోర్నదల పద్మ ఏకాంబరి లక్ష్మి విజయ శిఖరాలను అధిరోహించి యువతకి మార్గదర్శకంగా నిలిచింది. విశాలాంధ్ర ప్రత్యేక ఇంటర్వ్యూలో డీఈఈ మాట్లాడుతూ.. గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే.. మూడు సంవత్సరాల చిన్నారిని స్కూలుకు ఒకవైపు పంపిస్తూ.. మరోవైపు తాను జేఎన్టీయూ అనంతపురంలో 2001 నుంచి 2005 వరకు బిటెక్, 2005-2007 ఎంటెక్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేశానని తెలిపారు. 2007-2008 వరకు టీచింగ్ అసిస్టెంట్‌గా, అనంతరం ఆర్ అండ్‌బిలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించి సుదీర్ఘ సేవలను అందించి.. పదోన్నతులు పొంది.. విశ్వవిద్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలను స్వీకరించడం ఎంతో ఆనందం కలిగించింది అన్నారు.

గమ్యం నుంచి వెనుతిరగరాదు.. : పోటీ పరీక్షలలో ఎంచుకున్న గమ్యం వైపే అడుగులు వేయాలి కానీ వెనుతిరగరాదని.. పరీక్షలో విఫలమైతే మరింతగా శ్రమించాలని తెలిపారు. అవకాశాలుగా మలుచుకుని సమయాన్ని ప్రణాళిక రూపకల్పన చేసుకుంటూ.. నిత్యం అన్వేషణతో విజయ గమ్యాలను చేరుకోవాలని సూచించారు.

రైతులు పంటలు బాగా పండించుకోవాలి..

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

విశాలాంధ్ర-గుంతకల్లు : కూటమి ప్రభుత్వంలో రైతులు పంటలు బాగా పండించుకోవాలని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ అన్నారు. మల్యాల నుండి కర్నూలు అనంతపురం, చిత్తూరు జిల్లాలోని కుప్పం వరకు హంద్రీ నీవా కాలువకు శుక్రవారం కర్నూలు జిల్లాలోని పత్తికొండ నియోజకవర్గం యడవల్లి గ్రామంలో హంద్రీనీవా తూము నుంచి పత్తికొండ శ్యామ్ కుమార్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నీటిని వదిలారు. అనంతరం వారు మాట్లాడుతూ గుంతకల్ నియోజకవర్గ గ్రామాలకు శంకరబండ , ములకలపెంట, వైటీ చెరువు, అలాగే గుత్తి చెరువుకు నీరు చేరుతుందన్నారు. అలాగే ఎమ్మెల్యే గుమ్మనూరు గుంతకల్ మండలం జి కొట్టాల దగ్గర ఆలూరు కాలువ తూము గేట్లు ను తెరిచి నీటిని విడుదల చేశారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నలకు పంటలు పండించుకోవడానికి హంద్రీనీవా కాలువ నుండి 36 టీఎంసీలను విడుదల చేసిందని, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రాయల సీమను సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనీవా కాలువ పనులు మూడు నెలల్లోపు వేగవంతంగా పనులు చేసి వాటి ద్వారా నీటిని రైతులకు అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో గుంతకల్ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, ఆలూరు ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, పట్టణ ఉపాధ్యక్షుడు ఫజుల్లా పాల్గొన్నారు.

ల్యాండ్‌బ్యాంకును గుర్తించండి..

విశాలాంధ్ర-అనంతపురం: అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్‌ని గుర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ సంబంధిత శాధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో అహుడా విభాగం లోని ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలను మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో అహుడా పరిధిలో అవసరమైన ల్యాండ్ బ్యాంక్‌ని ఎక్కువగా గుర్తించాలని ఆదేశించారు. అలాగే ఎంఐజి లేఔట్‌లలో జరిగిన అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. అనంతపురం, మడకశిర, కళ్యాణ్‌దుర్గం, గుత్తి, పుట్టపర్తి హిందూపురం, పెనుగొండ తదితర ప్రాంతాలలో అ హు డా కు సంబంధించి చేపట్టిన చర్యలు మరియు ప్రస్తుత స్థితిగతులను అధికారుల ద్వారాఅడిగితెలుసుకున్నారు. ముఖ్యంగా అనుమతులు లేని, క్రమబద్ధీకరణ కానీ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లకు కచ్చితంగా అనుమతి పొందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జెపిఓ హరీష్, సర్వేయర్ శరత్ బాబు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

విశాలాంధ్ర-ఉరవకొండ : రాష్ట్రంలో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఉరవకొండ ఎంపీడీవో రవి ప్రసాద్ తెలిపారు. గురువారం ఉరవకొండ మండలం లత్తవరం గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ బోధపాటి గోవిందప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో పి4 పై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో గ్రామాలలో ఆర్థికంగా స్థిరపడి ఇతరులకు సహాయపడే స్థితిలో ఉన్న వారిని గుర్తించి వారి ద్వారా నిరుపేద కుటుంబాల అభివృద్ధికి సహకరించడమే పథకం ఉద్దేశమన్నారు. ప్రభుత్వ పథకాలు అందజేయడంలోనూ, పిల్లలను చదివించడంలోనూ, ఏదైనా స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణ ఇప్పించి వారు ఉపాధి పొందేలా సహకరించాలన్నారు. పేద కుటుంబాలతో మ్యాపింగ్ చేయాలని తెలిపారు. ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎవరైనా ఈ పథకంలో భాగస్వాములు కావచ్చు అని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఇతర సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి పి4 కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు.

స్టాక్ పాయింట్ల తనిఖీ

విశాలాంధ్ర-గుంతకల్లు: మండలంలోని స్టాక్ పాయింట్లును స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.మల్లికార్జునుడు, ఆర్.రామ్మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో మార్కెట్ యార్డులో ఉన్న బియ్యం స్టాక్ పాయింటను బళ్లారి రోడ్‌లో ఉన్న స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు.వాటి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో తహసీల్దార్ రమాదేవి, సివిఎస్‌డిటి సుబ్బలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భజన మందిరానికి భూమి పూజ

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రం లింకు రోడ్డు సమీపంలో గుడికల్లు శ్రీ అల్లి పీరా భజన మందిరానికి యాడికి మండల కేంద్రానికి చెందిన చారు గుండ్ల వెంకటరమణ, రాయల చెరువు గ్రామానికి చెందిన హాజీవలీ 25 సెంట్ల స్థలాన్ని స్థలాన్ని దానంగా ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. గురువారం స్థల దాతలు భజన మందిరానికి భూమి పూజ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల..

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: జేఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయం బిటెక్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలను ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో గురువారం డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు విడుదల చేశారు. జూన్, జులైలలో నిర్వహించిన పరీక్షలు బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 20) అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంబీఏ ఒకటవ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంసీఏ రెండవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులం, సప్లిమెంటరీ, ఒకటవ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు ఫార్మా.డి. నాలుగోసంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

పలు అభివృద్ధి అంశాలకు కౌన్సిల్ ఆమోదం

మౌలిక సౌకర్యాలకు పెద్దపీట

మున్సిపల్ వైస్ చైర్మన్ తలారి అరుణ

విశాలాంధ్ర-తాడిపత్రి : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తలారి అరుణ అధ్యక్షత పలు అభివృద్ధి అంశాలపై కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలారి అరుణ మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీరు అందించేందుకు కొత్త ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. వీధిలైట్లు, రోడ్ల నిర్మాణం అండర్ డ్రైనేజ్ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాకు మోటార్ల కొనుగోలు, అండర్ డ్రైనేజ్ మరమ్మత్తుల, మున్సిపల్ అవుట్సోర్సింగ్ నాన్ పిహెచ్ కార్మికుల వేతనాలు పెంపు, ఉద్యోగుల పి.ఎఫ్ ఖాతా నిధులు మంజూరు, సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు తదితర దాదాపు 26 అంశాలతో కూడిన అభివృద్ధి అంశాలను మున్సిపల్ కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, వైస్ చైర్మన్ శిక్షావలి కౌన్సిలర్లు మంగపట్నం లక్ష్మీదేవి, మూతి వరలక్ష్మి, బోసి అంజనమ్మ, జింకా లక్ష్మీదేవి, మల్లికార్జున, విజయ్ కుమార్ మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలి

విశాలాంధ్ర-బెల్లుప్ప : ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైతే పోలీసులు ఆశ్రయించి వారి సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ పేర్కొన్నారు మండల పరిధిలోని గురువారం అంకంపల్లి గ్రామంలో ప్రజల ప్రాథమిక హక్కుల పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా తాసిల్దార్ అనిల్ కుమార్. మండల ఎంపిడిఓ లక్ష్మీనారాయణ. ఎస్సై. శివ ట్రైనీ ఎస్సై. స్వామి హాజరయ్యారు. గ్రామాలలో పెత్తందారులు వెట్టి చాకిరి చేయించడం దౌర్జన్యాలు చేస్తుంటే బాల కార్మికులను వేధిస్తుంటే తమ దృష్టికి తెస్తే అటువంటి వ్యక్తులపై తీసుకుంటామన్నారు. కొందరు వ్యక్తులు ఎస్సీ ఎస్టీ లను అడ్డం పెట్టుకొని ఎస్సీ ఎస్టీ యాక్టును దుర్వినియోగం చేస్తుంటారని అలాంటి వారి మోసాలకు గురవవద్దంటూ సూచించారు. గ్రామాల్లో ప్రజలంతా ఒక్కటే అన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించే బాధ్యత సచివాలయ సిబ్బందిదే

విశాలాంధ్ర-బెలుగుప్ప: ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించడం సచివాలయం సిబ్బంది బాధ్యతని ఎంపీపీల జిల్లా సంఘం అధ్యక్షులు ఎంపీపీ పెద్దన్న తెలిపారు మండల పరిధిలోని గుండ్లపల్లి సచివాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు అనంతరం సచివాలయం సిబ్బంది హాజర పట్టికను రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సి పెద్దన్న మాట్లాడుతూ విధి నిర్వహణలు సక్రమంగా హాజరై ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు సచివాలయం సిబ్బంది ఎవరైనా విధులకు దుమ్మా కొడితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున, సచివాలయం సిబ్బంది సంయుక్త చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం మోసాలను తిప్పికొడదాం..

విశాలాంధ్ర-కణేకల్లు: రాయదుర్గం నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రాయదుర్గం నియోజకవర్గం కలేకుర్తి గ్రామంలో నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను వైసీపీ నాయకులు వివరించారు. ఏ గడపకు వెళ్లినా.. అందరి నోటా ఒకే మాట..మాకు జగన్ ప్రభుత్వం లోనే బాగా పథకాలు వస్తుండేవి ఇప్పుడేం రాలేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారని వైసీపీ నాయకులు వెల్లడించారు. బాబు మోసాలను తిప్పికొట్టాలని.. ఇందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు రాష్ట్ర జిల్లా నియోజక వర్గం నుండి ఎన్నుకోబడిన అనుబంధ విభగాల అధ్యక్షులు, అభిమానులు ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు..

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబిరసూల్ అన్నారు. గురువారం మండలంలోని శ్రీధర గట్టగ్రామంలో సివిల్ రైట్ డే లో మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోనా కాల్సును పట్టించుకోవద్దని అన్నారు. గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. బాలికలకు చిన్న వయసులోని బాల్య వివాహలు చేస్తే చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు. .

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర-రాప్తాడు : ప్రజా సమస్యలు పరిష్కరించడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా, మరూరు సొసైటి చైర్మన్ గోనుగుంట్ల గోపాల్ అన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో గురువారం మీ సమస్య మా బాధ్యత అనే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. గ్రామాల్లో ప్రజలు ఇల్లు, రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీ, తల్లికి వందనం, ఉపాధి హామీ కూలీ డబ్బులు, భూమి తదితర 184 సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరం ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మున్సిపల్ చైర్మన్ వన్నూర్ బీ అధ్యక్షతన శిబిరం కార్యక్రమం ను కర్నూల్ కు చెందిన ప్రముఖ ఒమిని హాస్పిటల్స్ సహకారంతో చేపట్టారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఇందు ప్రకాష్ రెడ్డి, ఎమర్జెన్సీ మెడికల్ నిపుణుడు డాక్టర్ సంతోష్ నాయక్ నేతృత్వంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఇకో వంటి ముఖ్యమైన పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది, కార్మికులు తమ కుటుంబాలను మరిచి ప్రజాసేవలో నిమగ్నమై ఉంటారని, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్మన్ వన్నూర్ బీ పేర్కొన్నారు.వైద్య పరీక్షల అనంతరం ఫలితాల ఆధారంగా మందుల వినియోగం, అవసరమైన వైద్య సలహాలను డాక్టర్లు అందించారు. 2డి ఇకో నిపుణురాలు జ్యోతి, ఈసీజీ నిపుణులు సింధు, కోఆర్డినేటర్ పృథ్వీ, మార్కెటింగ్ మేనేజర్ మహేష్ తదితరులు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, డి.ఈ.ఈ హేమచంద్ర, ఆర్.ఓ. సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, పట్టణ ప్రణాళిక విభాగ సూపర్ సూపరవైజర్ మారుతి ప్రసాద్, సర్వేయర్ దినేష్ రెడ్డి,మహిళా మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ మహాసభకు తరలివెళ్లిన నాయకులు

విశాలాంధ్ర-నల్లమాడ: ధర్మవరం ఎన్‌టిఆర్ సర్కిల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న సీపీఐ రెండవ మహాసభ కార్యక్రమానికి గురువారం సిపిఐ మండల కార్యదర్శి వలపి వెంకటరమణ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో సీపీఐ మండల కార్యదర్శులు నాగేంద్ర, గంగాధర్ ఉన్నారు. పేద, బడుగు ప్రజల హక్కుల సాధన కోసం, ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ నిరంతరం పోరాటలు చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు.

తాడిమర్రి మండలం నుంచి ..

విశాలాంధ్ర, తాడిమర్రి : ధర్మవరంలో నిర్వహిస్తున్న సిపిఐ మహాసభలకు తాడిమర్రి మండలం నుంచి సిపిఐ మండల కన్వీనర్ బికె లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. శుక్రవారం ఉదయం కూడా భారీ సంఖ్యలో జన సమీకరణ చేసి ర్యాలీగా బయలుదేరి మహాసభలకు చేరుకుంటామని సీపీఐ మండల కన్వీనర్ బికె లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ సన్న పెద్దన్న , హరే రామకృష్ణ, నాగేంద్ర, జయప్రకాష్, పోతలయ్య, చౌడప్ప నాగభూషణ దాసు పాల్గొన్నారు

ఓబులదేవర చెరువు మండలం నుంచి..

విశాలాంధ్ర-ఓబులదేవరచెరువు : ధర్మవరంలో గురువారం ప్రారంభమైన సీసీఐ జిల్లా రెండవ మహాసభలకు మండల సిపిఐ నాయకులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సిపిఐ పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. సిపిఐ మండల కార్యదర్శి చలపతి నాయుడు మాట్లాడుతూ... అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఓడిసి రూరల్ : సిపిఐ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల శాఖ పిలుపునిచ్చింది. ధర్మవరంలో జరుగుతున్న మహాసభలకు ఓడి చెరువు మండలం సుందరయ్య కాలనీ, గాజుగుంటపల్లి, బాబాసాహెబ్ పల్లి, కొండకమర్ల, తదితర గ్రామాల నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు అధిక సంఖ్యలో గురువారం తరలివెళ్లారు. ఇందులో సిపిఐ మండల కార్యదర్శి చలపతి, శ్రీనివాసులు, గంగులప్పా, సుధాకర్, రత్నాబాయి, రమణ, రమణమ్మ, లక్ష్మి ఉన్నారు.

విశాలాంధ్ర-బత్తలపల్లి : బత్తలపల్లి, మాల్యవంతం, ముష్టూరు, లింగారెడ్డిపల్లి, వేల్పుమడుగు, గంటాపురం, గుమ్మల కుంట, తదితర గ్రామాల నుంచి సిపిఐ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వాహనాలలో తరలివెళ్లారు. సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ మాట్లాడుతూ మహా సభల్లో నేతలు పలు సమస్యలపై చర్చిస్తారన్నారు.

విశాలాంధ్ర-చిలమత్తూరు : ధర్మవరంలో జరుగుతున్న సిపిఐ మహాసభకు చిలమత్తూర్ మండలం నుంచి సిపిఐ మండల కార్యదర్శి బాలచంద్ర ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు, ఈ నేపథ్యంలో ధర్మవరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పెద్ద రామాంజ నేయులు, నరసింహప్ప, అంజనప్ప, నాగరాజు పాల్గొన్నారు.

పేదల పాలిట అజెండానే సీపీఐ పార్టీ లక్ష్యం

- ఎర్రజెండాతోనే ప్రజలకు న్యాయం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో పూర్తిగా విఫలం
- సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్

విశాలాంధ్ర-ధర్మవరం: పేదల పాలిట అజెండా అనే సిపిఐ పార్టీ ముఖ్య లక్ష్యమని, ఎర్రజెండా తోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పరిపాలనలో పూర్తిగా విఫలమయ్యాయని శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, జగదీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరు ధర్మవరం పట్టణంలో నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ జిల్లా మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని, పేదవానికి ఎటువంటి లబ్ధి చేకూరటం లేదని మండిపడ్డారు. మోయలేని విద్యుత్ వారాన్ని ప్రజలపై మోపడం ఎంతవరకు సమంజసమని వారు తెలిపారు. కేంద్రము, ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కి ప్రజలను ఇబ్బందుల్లో పెట్టడం సమంజసమేనా అని వారు ప్రశ్నించారు. పేదల ఐక్యత కొరకే సిపిఐ పార్టీ ఎప్పుడు ముందంజలో ఉంటుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకట్ట వేస్తామని తెలిపారు. పేదలకు కూడు, గుడ్డ, విద్య, వైద్యం అందించుటలో రెండు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. నేడు రైతు వర్షాలు కురవక, పంటలు రాక, ఉపాధి నిమిత్తం నగరాలకు వలస పోతున్న పట్టీపట్టినట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా ఉంటాయని వారు నిలదీశారు. ప్రగల్భాలు పలకుండా పేదల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తేనే, కేంద్రం రాష్ట్ర అభివృద్ధి బాటలో నడుస్తుందని సలహా ఇచ్చారు. అలాగే గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు దూరంగా ఉండడం, అప్పుల పాలు కావడం జరిగిందని, మరి ఎన్డీఏ ప్రభుత్వం కూడా ఇదే దారిలో పోతోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజల జీవనోపాధికి కావలసిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అప్పుడే పేదరికం నిర్మూలించే అవకాశం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేతివృత్తి, చేనేత రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి, సిపిఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శిలు రమణ, శ్రీనివాసులు, చేనేత జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, పెద్ద సంఖ్యలో సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.

ధర్మవరంలో రెపరెపలాడిన ఎర్రజెండాలు

సిపిఐ రెండవ జిల్లా మహాసభల ర్యాలీ పూలవర్షం కురిపించిన పట్టణ ప్రజలు

విశాలాంధ్ర-ధర్మవరం: సీపీఐ పార్టీ రెండవ జిల్లా మహాసభలు ధర్మవరం పట్టణంలో గురువారం అత్యంత వైభవంగా జరిగింది. అన్ని వర్గాలు ప్రజలు భారీగా తరలివచ్చి పాల్గొని విజయవంతం చేశారు. ఈ ర్యాలీలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, నియోజకవర్గ కార్యదర్శి మధు, జింక చలపతి, రవికుమార్, రమణ, వెంకటనారాయణ, జిల్లాలోని సిపిఐ మండల కార్యదర్శి, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలతో మార్మోగించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శివానగర్లో గల శివాలయం నుండి పట్టణ పురవీధులలో వందల సంఖ్యలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు జిల్లాల నుండి తరలివచ్చిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణ పురవీధులలో ర్యాలీగా వచ్చిన సిపిఐ పార్టీ శ్రేణులకు ప్రజలు పూల వర్షంతో స్వాగతం పలికారు. పటాసులు పేలుస్తూ జిల్లా మహాసభలకు తరవివెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో గుత్తి, పత్తికొండ, కళాకారుల ప్రజానాట్యమండలి బృందం, రాందాస్, బాల రంగడు, ఓబులేసు, సుంకన్న, నాగేశ్వరరావుల నాట్యం అందరిని ఆకట్టుకుంది. ధర్మవరం పట్టణం ఎటుచూసిన ఎరుపు జెండాలతో మారుమోగింది. డప్పు వాయిద్యాలతో, నాట్యంతో పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున జిల్లాల నుండి మహిళలతో పాటు అధిక సంఖ్యలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జిల్లా ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యం వ్యహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి : వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ,సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధ్యక్షతన తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం 2007, తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి 2011 పై జిల్లా స్థాయి సీనియర్ సిటిజెన్ కమిటీ సమావేశం.. జిల్లా అధికారులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చాలా కుటుంబాల్లో వృద్ధులు నిర్లక్ష్యానికి, అగౌరవానికి గురవుతున్నారని, ఇలాంటి దుస్థితిని నివారించడానికే చట్టం రూపొందించబడిందని తెలిపారు. సెక్షన్ 23 ప్రకారం తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తిని తిరిగి తీసుకోనవచ్చని తెలిపారు. సెక్షన్ 24 ప్రకారం తల్లిదండ్రులను సంరక్షణ నిర్లక్ష్యం చేస్తే 3 నెలల జైలు శిక్ష రూ.5 వేల జరిమానా కూడా విధించబడు తుందని తెలియజేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం రెవెన్యూ డివిజనల్ అధికారులు సువర్ణ, మహేష్, సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులతో ఎమ్మెల్యే బాలయ్య భేటీ

విశాలాంధ్ర-చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గం ఎమ్మెల్యే బాలయ్య ఢిల్లీలోని పార్లమెంట్ లో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రి, నితిన్ గడ్కరి, కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి, మనోహర్ లాల్ ఖట్టర్ లను కలిసి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ కు హిందూపురం పట్టణం లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నందున రింగ్ రోడ్డు నిర్మాణానికి మరియు పార్లమెంట్ పరిధిలో ని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిఎస్ఆర్ నిధులను విడుదల చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో హిందూపురం ఎమ్మెల్యే బాలయ్యకు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఢిల్లీకి విచ్చేసిన సందర్భంగా ఘన సన్మానం చేశారు, ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథి కేంద్ర మంత్రులు సహచర పార్లమెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిల క్షేత్ర పర్యటనలు ప్రారంభం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాలలో ఎల్కేజీ యూకేజీ చదువుతున్న విద్యార్థులకు కేంద్రీకృత అభ్యాస అనుభవా లను పెంపొందించుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనను పాఠశాల కరస్పాండెంట్ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆర్టీసీ బస్టాండ్‌కు తీసుకొని బస్సులు గూర్చి పాఠశాల ప్రిన్సిపాల్ కరుణ్ స్వరూప్ సింగ్ వివరించారు. తదుపరి పార్కుకు తీసుకెళ్లి ఆటలను ఆడుకునే విధానాన్ని కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి, సీఈఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించిన ఎస్పీ

విశాలాంధ్ర-కదిరి: రూ.43లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్, మహిళా రక్షణ విభాగాన్ని జిల్లా ఎస్పీ రత్న, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. పట్టణంలో ఎటువంటి అసాంఘిక, దోపిడీలు దొంగతనాలు జరగకుండా కాదు నాతిన సీసీ కెమెరాల ద్వారా కట్టడి చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివిఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణ స్వామి, పట్టణ సీఐ నారాయణ రెడ్డి,రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, అఫ్లేడ్ సీఐ నిరంజన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాద్ ఉన్నీసా,రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పి వి.పవన్‌కుమార్ రెడ్డి,మాజీ శాసనసభ్యులు ఎం.ఎస్ పార్థసారథి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మున్సిపాలిటీ అభివృద్ధి

మున్సిపల్ చైర్ పర్సన్ కాచెర్ల లక్ష్మి

విశాలాంధ్ర-ధర్మవరం : పురపాలక సంఘ అభివృద్ధికి అందరూ సహకరిస్తేనే అభివృద్ధి జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్, కాచర్ల లక్ష్మీ తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని అంశాలపై చదివి వినిపించారు. అనంతరం కౌన్సిలర్లు చెందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంగా టెండర్లు పిలుస్తున్నారని.. పనులే చేపట్టడం లేదని మండిపడ్డారు. కనీసం అభివృద్ధి పనులకు మాకు సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. పందులు వీధి కుక్కల సమస్యలను కూడా పరిష్కరించలేక పోవడంలో నిర్లక్ష్యం అధికారుల వద్ద ఉంది అని స్పష్టం చేశారు.

అదేవిధంగా వార్డులలో నెలకొన్న పారిశుద్ధ్య వీధిలైట్లు ఇంతవరకు పరిష్కారం కాలేదని తెలిపారు. గాంధీ విగ్రహం నుంచి ఎర్రగుంట వరకు వీధిలైట్లు వెలగడం లేదని పారిశుద్ధ్య కార్మికులు తెల్లవారుజామున ప్రమాదాలకు గురి అయ్యే అవకాశం ఉందని గుర్తు చేశారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికై వెంటనే చర్యలు చేపడతామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ శంషాద్ బేగం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి..

డీజిల్ కుంభ కోణం నిగ్గు తేల్చాలంటూ కౌన్సిలర్లు డిమాండ్

విశాలాంధ్ర-కదిరి: అధికారులు విధి నిర్వహణలో బాధ్యతగా పని చేస్తూ పట్టణ పరిశుభ్రతపై పట్టు సాధించాలంటూ శానిటేషన్ అధికారులపై పలువురు కౌన్సిలర్లు కోరారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో జరిగిన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో 26వ వార్డ్ కౌన్సిలర్ ఫయాజ్ ఖాన్ మాట్లాడుతూ డివైడర్ మధ్య ఎపుగా పెరిగిన చెట్లను తొలగించాలని ఎన్ని సార్లు కోరిన ఇంత వరకు స్పందించని ఏఈపై మండిపడ్డారు. మున్సిపాలిటీలో పేరుకపోయినా బకాయిలు వసూలు చేయడంలో అధికారులు చేస్తున్న నిర్లక్ష్యం సరికాద న్నారు. చెత్త సేకరణ కోసం వాడే వాహనాలకు పట్టే డీజల్ కుంభకోణం పై విచారణ చేపట్టాలని, మూలన పడ్డ వాహనాలకు కూడా డీజల్ పట్టినట్టు బోగస్ బిల్లులపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దిల్షాదున్నీసా,వైస్ చైర్మన్లు సుధారాణి, రాజశేఖర్ ఆచారి, అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టండి..

విశాలాంధ్ర-రొళ్ల: చిరుధాన్యల పంట సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి వెంకట బ్రహ్మం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక శ్రీశక్తి భవనంలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుట్టపర్తి డిస్టిక్ రిసోర్స్ సెంటర్ ఏడిఏ కృష్ణశైల కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు రాగి కంది మినప చిరుధాన్యాల పంట సాగుపై ప్రత్యేక దృష్టి పెడితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. వేరుశనగ కంది,మొక్కజొన్న,కొర్రె,సజ్జ పంటలలో సస్య సంరక్షణ గురించి ఎరువులు యాజమాన్యం గురించి వివరించారు. మేలు రకం రాగి ఎస్ఐఏ-3159 కొర్రె రకం మినీ కిట్లను అభ్యుదయ రైతులకు పంపిణీ చేశారు ఏఈఓ చంద్రకళ,హేమలత ఈ కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ బి.ఎస్ గురుమూర్తి, వక్కలిగా రాష్ట్ర సాధికార కన్వీనర్ వి.యం పాండురంగప్ప సింగల్ విండో అధ్యక్షులు దాసరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జి.కె ఈరన్న టి.ఎస్.టి.యు.సి జిల్లా ఉపాధ్యక్షులు బ్యాడగేరి మూర్తి పాల్గొన్నారు..

రైతులు ఈ కేవైసీ చేయించుకోండి

విశాలాంధ్ర-అగళి : మండలంలోని రైతులు ఎన్పీసీఐ, లింకు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. మండలంలో ఇంకనూ 68 మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదని దీంతో ఆ రైతులు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ అందుకోలేకపోతున్నారు. రైతుసేవ కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 2న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంబిస్తాయని సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని మందలపల్లి బిసి వసతి గృహాన్ని గురువారం గుడిబండ తహశీల్దార్ శ్రీధర్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ వార్డన్ శ్రీనివాస్‌తో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం కోడిగుడ్లు, అరటిపండ్లు, చిక్కిపప్పు రసం అన్నం గల మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం గుడిబండ రాజీవ్ కాలనీలో పౌర హక్కులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు సమానమేనని అందరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

విలేకరులపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల జులుం..

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్దకు వార్త సేకరణకు వెళ్లిన విలేకరుల పట్ల ఇరువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అసభ్యకర పదజాలంతో దూషించారు. గురువారం ఎంపీడీవో, తహసీల్దార్,డిప్యూటీ ఎంపీడీవో లు తహసీల్దార్ కార్యాలయం పక్కనే వేస్తున్న ప్లాట్ల యజమానులను పిలిపించారు. అక్కడికి చేరుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈటే నాగరాజు, కాంతా రానాలు కార్యాలయంలో ఉన్న విలేకరులపై అధికారుల ముందు నానా దుర్భాషలాడుతూ మాపై వార్త రాస్తే చెట్టుకు కట్టేసి కొడతాం, మీ అంతు చూస్తాం అంటూ వీరంగం సృష్టించారు. దీనిపై ఏపీయూడబ్ల్యూజే కమిటీ ఆధ్వర్యంలో ఎస్సై వలి బాషాకు విలేకరులపై దుర్భాషలాడిన రియల్ స్టేట్ వ్యాపారులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

అసాంఘిక కార్యకలాపాపై నిఘా ఉంచండి

విశాలాంధ్ర-రొళ్ల: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్సై వీరాంజనేయులు తెలిపారు. ఎస్పీ వి.రత్నం ఆదేశాల మేరకు పెనుకొండ డి.ఎస్.పి నరసింగప్ప, మడకశిర సిఐ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారు జామున మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామంలో పోలీస్ కార్డెన్ సర్చ్ ఆపరేషన్ అగళి ఎస్సై వీరేష్‌తో కలిసి నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు నేరస్తులు తిరిగితే అలాంటి వారిపై సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి కర్ణాటక మద్యం విక్రయించరాదనిన్నారు. ఎలాంటి రికార్డులు లేని మోటర్ సైకిల్ వాహనాలను తనిఖీ చేసి వాహనచోదకులు తమ రికార్డులు తమ వద్దే పెట్టుకోవాలని గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదని గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు తెలియజేసారు.మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాల గురించి వివరించారు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఇనాయిత్ తుల్లా హెూంగార్డ్ రమేష్ పాల్గొన్నారు..

మృతులకు నివాళులర్పించిన మంత్రి

విశాలాంధ్ర-గోరంట్ల : మండలంలోని వడిగేపల్లి పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆంజనేయులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు,అలాగే గోరంట్ల మండలంలోని దిగువగంగంపల్లి తండాకు చెందిన సంతోష్ నాయక్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా వారి భౌతిక కాయలను పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. అక్కడికివెళ్లి మంత్రి సవిత మృత దేహాలకు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైసీపీ బూత్ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-గోరంట్ల: వైసీపీ జిల్లా అధ్యక్షురాలు పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్త ఉషశ్రీ చరణ్ గోరంట్ల మండలంలోని వెంకటరమణ పల్లి గ్రామంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో భాగంగా నూతన బూత్ కమిటీని ప్రకటించారు, అధ్యక్షులుగా సురేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా చరణ్, మునీశ్వరప్ప, జనరల్ సెక్రెటరీగా చంద్రశేఖర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా రాఘవేంద్ర రెడ్డి, రైతు విభాగం వెంకటరెడ్డి ,సోషల్ మీడియా హరీష్ ఐటీ వింగ్ అను శంకర్ రెడ్డి, బిసి కార్యదర్శి నరసింహప్ప, లక్ష్మీనరసప్ప, రైతు విభాగం నరసింహప్ప, మైనార్టీ చైర్మన్ బాబావలి, మైనార్టీ సెక్రెటరీ ఇలియాస్, మైనార్టీ యూత్ షేక్షావలి, బీసీ కార్యదర్శి అశ్వర్థ రాము, దాలప్ప, రామచంద్ర, శివప్ప, మధుసూదన్ రెడ్డి, సోము, రంగయ్య, సోమశేఖర్‌లను ప్రకటించారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశ్వర్ రెడ్డి వైసీపీ నాయకులు సంపత్ కుమార్, జడ్పిటిసి పాలే జయరాం నాయక్, జిల్లా నాయకులు పోతుల రామకృష్ణారెడ్డి రఘురామిరెడ్డి మాజీ సర్పంచ్ బూదిలీ శ్రీనివాస్ రెడ్డి, మండల కన్వీనర్ వెంకటేష్ పట్టణ కన్వీనర్ మేదర శంకర్ పుల్లేరు సురేష్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసులు ప్రతాప్ సింగ్ భాషా సర్పంచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంఈఓగా అరవింద కుమార్

విశాలాంధ్ర-రొద్దం: మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎఫ్ ఎసివ విద్యాధికారిగా గురువారం అరవింద కుమార్ బాధ్యతలు చేపట్టారు, అనంతరం మర్యాదపూర్వకంగా తహసీల్దార్‌ను కలిసారు. సిబ్బంది విద్యాధికారిని పూలమాలతో సత్కరించారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 1,ఆగస్టు 2025

మెనూ ప్రకారం భోజనం అందించాలి

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని గౌనూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ-1 వీరన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు పాఠశాలకు ఎంతమంది వస్తున్నారు అని ప్రధానోపాధ్యాయున్ని అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఎంఈఓకు సన్మానం

విశాలాంధ్ర- పెనుకొండ: పెనుకొండ మండల విద్యాశాఖ అధికారి 1గా పని చేస్తున్న చంద్రశేఖర్ గురువారం పదవీ విరమణ చేశారు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది మండల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంయుక్తంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో చంద్రశేఖర్ దంపతులను పూలమాలలతో మెమెంటాలతో సత్కరించారు, వక్తలు ప్రసంగిస్తూ 36 సంవత్సరాలుగా సుదీర్ఘకాలం విద్యాశాఖలో ఉపాధ్యాయునిగా ప్రధానోపాధ్యాయునిగా విద్యాశాఖ అధికారిగా విశేష సేవలు అందించారని కొనియాడారు.

పలువురు బీజేపీలో చేరిక

విశాలాంధ్ర-పెనుకొండ : పుట్టపర్తిలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ర్యాలీ.. బహిరంగ సభలో మంత్రి సత్య కుమార్ యాదవ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శేఖర్‌స్వామి, సీనియర్ నాయకులు ఎనుముల రామకృష్ణ, అంగడి రామాంజనేయులు, డాక్టర్ గోపీనాథ్ సమక్షంలో పెనుకొండ వీహెచ్‌పీ మాజీ అధ్యక్షులు జిల్లా వీహెచ్‌పీ శాఖలో పనిచేస్తున్న వేదవ్యాస్ స్వామి వారి మిత్రబృందం 120 మంది కార్యకర్తలు గురువారం భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

వైసీపీ నాయకుడికి నివాళులు

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని గుట్టూరు పంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కురుబ ఆంజనేయులు(58) ఆకస్మికంగా గుండెపోటుతో మరణించారు. ఈ మేరకు ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను మాజీ మంత్రి వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పీఏసీ సభ్యులు మాలగుండ్ల శంకర్ నారాయణ, బోయ సాధికారిక రాష్ట్ర కమిటీ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపిటిసి నిర్మల నారాయణస్వామి, సర్పంచులు, ఆదినారాయణ, శ్రీకాంత్ రెడ్డి, పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పెనుకొండ : పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు గురువారం డాక్టర్ పి శ్రీదేవి పదవీ విరమణ సందర్భంగా పలు కళాశాలల వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, లెక్చరర్స్, మండల విద్యాశాఖా ధికారులు, హెడ్మాస్టర్స్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు దుశ్శాలువా, పుష్పమాలికలతో, సన్మానం చేసి జ్ఞాపికలు బహూకరించారు. గత జ్ఞాపకాలను స్మరించుకున్నారు,

రాష్ట్ర అధ్యక్షులు పి.వీ.ఎన్. మాధవ్ పర్యటనకు తరలిన బిజెపి నాయకులు

విశాలాంధ్ర-అగళి : పుట్టపర్తిలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వీ.ఎన్. మాధవ్ సారథ్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి మడకశిర నియోజకవర్గ నుండి మడకశిర ఇంచార్జ్ కే . బసవరాజు కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. రాయలసీమ పర్యటనలో భాగంగా పుట్టపర్తిలో జరుగు విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ గురువారం పుట్టపర్తికి వచ్చారు. ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మడకశిర ఇంచార్జ్ కే.బసవరాజు కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ సారథ్యంలో ఐదు మండలాల నుంచి ముఖ్య నాయకులు బయలుదేరి వెళ్లారు. పుట్టపర్తిలో రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్‌ని రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ.విష్ణు వర్ధనరెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎస్.చంద్రశేఖర్ మడకశిర బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు.

ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని కరికెర కెజిబివి జూనియర్ కళాశాలలో ఎంపిసి గ్రూప్ లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 32 సీట్లు, ద్వితీయ సంవత్సరం 28 సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు.అలాగే అడ్మిషన్లకు ఆసక్తి గలవారు బాలికలు ఆగస్టు నెల శనివారం సాయంత్రం 5 గంటల లోపల దరఖాస్తులు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్ తనిఖీ

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు దేవరాజన్, అప్పయ్య తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌ను గురువారం తనిఖీ చేశారు. జ్వరం అని వచ్చిన ప్రతి ఒక్కరికీ మలేరియా, డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్ తదితర రక్త పరీక్షలు నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్ సాయిలతకు సూచించారు. వర్షాకాలం కావున గ్రామాలలో జ్వరాలు ఎక్కువగా వస్తాయి.. ఏఎన్ఎంలు మేల్ హెల్త్ అసిస్టెంట్లు నిర్దేశించిన గ్రామాల్లో రక్తనమూనాలుతీయాలని సూచించారు.

అంజన్న సన్నిధిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ..

విశాలాంధ్ర-గుంతకల్లు: కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామిని గురువారం కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్పీ చౌడేశ్వరి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వేద పండితులు అర్చకులు స్వాగతం పలికారు, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆది, సోమ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

విశాలాంధ్ర-బొమ్మనహాల్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో శిథిలావస్థకు చేరిన నీలకంఠేశ్వర దేవాలయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పునరుద్ధరించారు. ఆలయంలో నూతన నందీశ్వర విగ్రహం, గోపుర కలస ప్రతిష్టాపన కార్యక్రమం ఆది, సోమవారాలు రెండు రోజులపాటు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గురువారం ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం ఉదయం 6.05 నుండి 7.15 వరకు బ్రహ్మ ముహూర్తమున ప్రతిష్ట కార్యక్రమానికి కల్లు హెరాలె మఠం పల్లూరుకు చెందిన చన్నవీర శివాచార్య మహాస్వామి , హిరేమఠం సంగమేశ్వర స్వామి అర్చనలు నిర్వహిస్తారు. ఆదివారం జలధివాస, క్షీరాదివాస, ధాన్యాధివాసం, సాయంత్రం మహా గణపతి పూజ, నంది సమారాధన, నవగ్రహ పూజ సోమవారం ఉదయం 5.00 గంటల నుండి నీలకంఠేశ్వర నందీశ్వర గోపుర కళశాలకు రుద్రాభిషేక, బిల్వార్చన, ప్రాణ ప్రతిష్టాపన ఉంటుంది.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-పెనుకొండ: రొద్దం మండల పరిధిలోని పెద్దిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త భాస్కర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు వెళ్తుండగా వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందచేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ, ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని.. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు

గవి మఠం ఆస్తులను పరిరక్షించడమే లక్ష్యం..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం దేవస్థానానికి సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని గవి మఠం ఉత్తరాధికారి కరి బసవ రాజేంద్ర స్వామి తెలిపారు. గురువారం స్థానిక మఠంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018లో అప్పటి ఎ.పి.ఎండోమెంట్ కమిషనర్ ఉత్తరాధికారి అయిన నాకు ఆస్తులను కాపాడటానికి గాను రూ.12 వేల గౌరవ వేతనం ఇవ్వాలని గవిమఠం మేనేజర్‌ను దేశించారు. నా దృష్టికి వచ్చిన కర్ణాటక రాష్ట్రం లోని చిత్రదుర్గ్ జిల్లా కృష్ణా రాజపురం లో ఉన్న (సర్వే నెంబర్ 39) 10 ఎకరాల వ్యవసాయ భూమిని గవిమఠం శాఖకు సంబంధించిన జాగిరు బుద్దనహళ్లి అర్చకులకు ధూపదీప నైవేద్యానికి ఇచ్చిన భూమిని 2003లో అక్కడి రెవెన్యూ కార్యాలయంలో అక్రమంగా తమ పేరు మీదకు మార్చుకున్నట్లు తెలిసిందని నేను అక్కడి రెవెన్యూ, ఉన్నతాధికారుల దృష్టికి సాక్షాధారాలతో సహా ఈ ఆస్తి ఉరవకొండ గవిమఠం సంస్థానానికి చెందినదిగా నిరూపించానని తెలిపారు.

పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-గుంతకల్లు : రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 5వ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఎన్ ప్రమీలమ్మ అన్నారు. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నగర్ నందు గల 5వ వార్డు సచివాలయం నందు వీఆర్ఓ చంద్రశేఖర్ అధ్యక్షతన గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమీలమ్మ మాట్లాడుతూ ఏ వ్యక్తి కైనా వారి హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు.అనంతరం వార్డు టిడిపి ఇన్చార్జి ఎన్. రవికుమార్ మాట్లాడుతూ కుల వివక్ష అంటరానితనాన్ని నిర్మూలించాలని, అన్ని కులాలు వర్గాలు వారు సోదరులతో మెలగాలని సూచించారు. ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిన అతి గొప్ప వరం పౌర హక్కులని ఆ చట్టాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని టిడిపి ఎస్సీ సెల్ పట్టణ నాయకులు సూర్య పోగుల. మల్లేష్ తెలిపారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

విశాలాంధ్ర-గుంతకల్లు : నిరుపేదల వైద్యుల ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ పథకం ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 18వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆయన సోదరుడు గుంతకల్లు మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి చేతులు మీదుగా బాధ్యత కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ 18వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కుల విలువ 9, 78,221 రూపాయలు 24 మంది నిరుపేద లబ్ధిదారులకు అందించడం జరిగిందని, ఆంధ్ర రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వనంత ప్రాధాన్యత మన గుంతకల్లు నియోజక వర్గానికి ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చారని గుర్తు చేశారు. 2,15,00,000 రూపాయలు అందించారని చెప్పారు. సుపరి పాలన పర్యటనలో ఏ గ్రామానికి వెళ్ళిన ఏ వార్డులో వెళ్లిన అవ్వ తాతలు ఒకటే మాట అంటున్నారు 1వ తారీఖు రాగానే నెల జీతం లాగా 4000 రూపాయలు పింఛన్ వస్తున్నదని.. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, కడుపునిండా మూడు పూటల 15 రూపాయలకే అన్నా క్యాంటీన్ల ద్వారా కడుపు నింపుతున్న నారా చంద్రబాబు నాయుడు కి రుణపడి ఉంటామని అంటున్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకంలో ఒకటి అయినా తల్లికి వందనంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విభిన్న ఆలోచనలతో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.13 వేల చొప్పున తల్లుల ఖాతాలో జమ చేస్తున్నారని, నేడు హంద్రీనివా కాల్వ పరిమాణాన్ని పెంచి 1100 నుంచి 2600 క్యూసిక్కుల నీరు రైతుల అందుబాటులోకి తెచ్చి అనంతపురం జిల్లాను సస్యశ్యామలంగా చేస్తున్నారని తెలిపారు.

పంటల బీమా ప్రీమియం గడువు పెంచాలి..

విశాలాంధ్ర-ఉరవకొండ: పంటలకు బీమా చెల్లించేందుకు రైతులకు జూలై 31వరకు రాష్ట్ర ప్రభుత్వం గడువు నిర్ణయిం చిందని అయితే ఆన్‌లైన్‌లో రెండు రోజులుగా ఆటంకాలు ఏర్పడడం వల్ల ప్రీమియం చెల్లించలేకపోయామని రైతులు చెబుతున్నారు. దీంతో రెండు రోజులుగా మీసేవ కేంద్రాల వద్దకు తిరుగుతున్నామని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ పంటల బీమా ప్రీమియం చెల్లించే గడువు పొడిగించాలని కోరుతున్నారు.

ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల వల్ల రైతులకు ఇబ్బందులు.. పంటల బీమా ప్రీమియం రైతులు చెల్లించేందుకు ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకి అప్పజెప్పడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం నాయకులు చెన్నారాయుడు తెలిపారు. ప్రీమియం చెల్లించేం దుకు గత రెండు రోజులుగా రైతులు మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆన్లైన్లో అనేక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి అన్నారు. ప్రైవేటు కంపెనీలకు కాకుండా ప్రభుత్వమే రైతుల నుంచి ప్రీమియం కట్టించుకోవాలని మరింత గడువును కూడా పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

పీ 4 మార్గదర్శుల గుర్తింపులో పురోగతి సాధిస్తాం..

విశాలాంధ్ర-అనంతపురం: ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం అన్నదాత సుఖీభవ, స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్, సానుకూల ప్రజా అవగాహన, గంజాయి, డ్రగ్స్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్ కార్యక్రమం కింద మార్గదర్శుల గుర్తింపులో పురోగతి తీసుకువస్తామన్నారు. జిల్లాలో మార్గదర్శుల గుర్తింపుపై, ఇంటింటికి చెత్త సేకరణ, వాహనాల తరలింపు, ఇతర అంశాలపై శ్రద్ధ పెట్టడం జరిగిందని తెలిపారు.

సీపీఓ అశోక్ కుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పి సిఈఓ శివశంకర్, డీఐపీఆర్ఓ ఏ.బాలకొండయ్య, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, హెచ్.ఎన్.ఎస్.ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్ కుమార్, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ద్రోహం చేసిన కూటమి ప్రభుత్వం..

విశాలాంధ్ర-గుత్తి : మండల పరిధిలో రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని వైసీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో తొండపాడులో నిర్వహించిన సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం లో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతుల కోసం ఏటా ఇన్సూరెన్స్ ప్రభుత్వమే ప్రతి పంటకు ప్రతి ఎకరాకు ముందుగానే చెల్లించేది పంట నష్టపరిహారం కూడా వెంటనే వచ్చేది కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇన్సూరెన్స్ చెల్లించకపోవడం వల్ల పోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కట్టాలి గత వారం రోజులుగా సాంకేతిక కారణాల వల్ల రైతులు తీవ్ర అవస్థ పడుతున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇన్సూరెన్స్ చెల్లించే గడువు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటివరకు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ కూడా ఇప్పటి వరకు ఒక్క రూపాయి చెల్లించలేదు. రాయలసీమలో ఇప్పటికీ సరైన వర్షాలు కురవక పంటలే వెయ్యలేదు ప్రభుత్వం ఎకరాలు పెట్టుబడి కింద పదివేలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు బ్రహ్మానంద రెడ్డి సుబ్బు ఆచారి జ్ఞానేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు రాజ గోపాల్ వెంకటస్వామి హరీష్ కుమార్ పాల్గొన్నారు.

ఎంపీ హెచ్‌ఈఓ శ్రీరాములు సేవలు ప్రశంసనీయం

పదవీ విరమణ చేసిన శ్రీరాములను ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-ఉరవకొండ : వజ్రకరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్‌ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తూ గురువారం పదవి విరమణ చేసిన శ్రీరాములను సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రజాసంఘాల నాయకులు వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ తేజస్వి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఎంపిహెచ్ ఈఓ శ్రీరాములు గత 33 సంవత్సరాలుగా వృత్తిని దైవంగా భావించి ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. తనకు వృత్తి అంటే ఎంతో అభిమానం అని ఇలాంటి వృత్తి లో రాణించడం శ్రీరాములు చేసుకున్న అదృష్టమన్నారు. తమ వృత్తిలో రాణిస్తూ హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ... శ్రీరాములు వైద్య ఆరోగ్యశాఖలో అంకితభావంతో సేవలందించి పలువురి మన్ననలు పొందారున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉద్యోగరీత్యా కాకుండా ఎంపిహెచ్ ఈఓ అసోసియేషన్ నాయకులుగా మరియు ఉరవకొండ తాలూకా అధ్యక్షులు, జిల్లా ఉత్తమ సేవా అవార్డు గ్రహీత గా ఎంపికై విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న శ్రీరాములు ను వైద్యాధికారి డాక్టర్ సర్దార్ వలి, ఎంఈఓ ఎర్రిస్వామి, సిహెచ్ఓ లక్ష్మీదేవి, ఎంపిహెచ్ ఈఓ గురు ప్రసాద్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత బెంజిమెన్, చాబాల సర్పంచ్ జగదీశ్, సూపర్వైజర్ నాగ శంకర్, సుశీలమ్మ, శాలువా పూలమాల మరియు బహుమతితో ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్షి ప్రేమ్ చంద్ గొప్ప కవి

జయంతి సందర్భంగా పలువురు ఘన నివాళులు

విశాలాంధ్ర-గుంతకల్లు: స్థానిక ఎస్.కే.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల గుంతకల్లులో హిందీ శాఖ ఆధ్వర్యంలో మున్షి ప్రేమ్‌చంద్ జయంతి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఏ. లక్ష్మయ్య మాట్లాడుతూ మున్షి ప్రేమ్ చంద్ గొప్ప కవి, రచయిత. ఆయన హిందీ ఉర్దూ భాషలలో రచనలు చేశారు. ఈయన రాసిన రెండు నవలలు సినిమాలుగా కూడా వెలువడ్డాయని చెప్పారు. కవులను గుర్తు చేసుకోవడం వారి రచనలను సమాజంలోకి తీసుకెళ్లడం భాషావేత్తల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. హిందీ సాహిత్యంలో ప్రేమ్ చంద్ నవలలు, కథలు, మరియు వ్యాసాలు రాసి ప్రసిద్ధి చెందారు. మున్షి ప్రేమ్ చంద్ గారి నవలల మీద నేటికి కూడా విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. అని విద్యార్థులకు సూచించారు. హిందీ ఉపన్యాసకులు డాక్టర్. గట్టి రామకృష్ణ మాట్లాడుతూ హిందీ సాహిత్యంలో ప్రేమ్ చంద్ ఒక మైలురాయి. ఆయన తన విద్యాభ్యాసన్నంతా పారసీ భాషలో అభ్యాసం చేసినప్పటికీ తన రచన సాహిత్యాన్ని మాత్రం స్వాతంత్రోద్యమ సమయంలో ఉర్దూ భాషలోనూ, హిందీ భాషలోనూ అనేక రచనలు చేసి సామాజిక చైతన్యాన్ని నింపారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ. రవిశంకర్ శర్మ, ఉర్దూ అధ్యాపకులు జబ్రుల్లా, హిస్టరీ అధ్యాపకులు కే. గోపి నాయక్, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలు పెంచాలి

విశాలాంధ్ర-కణేకల్లు : రాత్రి అనక పగలనకా కష్టపడి బురద మట్టిని పిసికి ధాన్యం పండించి దేశానికి అన్నం పెట్టే రైతన్నల గోడు వర్ణనాతీతం. వరి పైరుకు వేసే ఎరువులు యూరియా రైతులకు అందడం లేదని.. రోజంతా సొసైటీ బ్యాంకుల వద్ద పడికాపులు కాచిన నాలుగు బస్తాల మాత్రమే ఇస్తున్నారని మారంపల్లికి చెందిన రైతు రుద్రన్న ఆవేదన చెందారు. ప్రభుత్వం యూరియా పై రైతులకు ఇస్తున్న సబ్సిడీ కారణంగా రైతులకు తగినంత మోతాదులో యూరియా దొరకడం లేదని.. మరోవైపు కరెంట్ కష్టాలు అయితే చెప్పనక్కర్లేదని అంటున్నాడు. ఇలా కష్టాలు దాటుకొని రైతన్నలు ధాన్యం పండిస్తే దళారులక ఐపీ రూపంలో దగా చేస్తున్నారు. ఒకరోజు కూలీకి పోతే 500 రూపాయలు ఇస్తారు, అదే చిన్న కారు రైతు నాలుగు బస్తాల కోసం బ్యాంకుల వద్ద కూలీ పనుల మానుకొని క్యూలో నిలబడితే నాలుగు బస్తాలు వస్తాయి ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల్లో కొందామన్న ప్రభుత్వం బయట దొరకడం లేదని, యూరియా సక్రమంగా అందించాలని అధికారులను కోరుతున్నారు.

పౌర హక్కులపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-నంబులపూలకుంట: పౌర హక్కుల పరిరక్షణకు మండల అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తహసీల్దార్ దేవేంద్ర నాయక్,డిప్యూటీ ఎంపీడీవో మాధవరెడ్డి తెలిపారు. గురువారం పెడబల్లి గ్రామం ఎస్సీ కాలనీలోౌర హక్కుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలు, మహిళల హక్కులకు భంగం కలిగినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పోలీసుస్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం కేసులు పక్కాగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి నెలా ఆఖరు రోజు పౌర హక్కుల పరిరక్షణ కోసం కేటాయిస్తూ స్థానిక ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.ఎవరైనా అగ్రకులాల వారి నుండి వేధింపులకు గురైతే తమకు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన మంత్రి సవిత

విశాలాంధ్ర-పెనుకొండ : కీర్తిశేషులు మాజీమంత్రి పెనుకొండ మాజీ ఎమ్మెల్యే అణగారిన వర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన పరిటాల రవీంద్ర, కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం పెనుకొండ పట్టణంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ స్థల పరిశీలన చేశారు. కార్యకర్తలు నాయకులు అభిప్రాయం మేరకు విగ్రహం ఏర్పాటు చేసి పరిటాల రవీంద్ర పెనుకొండ నియోజకవర్గానికి చేసిన సేవలు గుర్తిండిపోయేలా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంత్రితోపాటు నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని బాబు..

విశాలాంధ్ర-గుడిబండ : మండలంలోని చిగతుర్పి కె.ఎన్ పల్లి గ్రామలలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ యంజార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి శివకుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు శివరుద్రమ్మ, లక్ష్మీదేవి, మందలపల్లి సర్పంచ్ అశ్వత్, వైసీపీ నాయకులు వడ్డగిరప్ప, మాజీ డీలర్ మల్లేష్, దాసన్న, సోషల్ మీడియా కన్వీనర్ రామచంద్ర,రంగనాథ్, రంగధామప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

విశాలాంధ్ర-యాడికి : పెద్దపప్పూరు మండలం చీములవాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పుష్పాంజలి ఉపాధ్యాయురాలు గురువారం పదవీ విరమణ చేసిన సందర్భంగా పాఠశాల సిబ్బంది బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నాయకులు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి, పప్పూరు మండల విద్యాధికారులు పాల్గొన్నారు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో కూడా ఆమె బోధించిన సబ్జెక్టులో దాదాపు 95 శాతంతో మంచి ఉత్తీర్ణత సాధించారని ఆమె శేష జీవితం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. అనంతరం పుష్పాంజలి, నాగభూషణ్ రెడ్డి దంపతులకు చవ్వా గోపాల్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయురాలు కుందా చౌడమ్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు మహబూబ్‌బాషా తదితర బంధుమిత్రులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు.

కళేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎండోమెంట్ అధికారులు

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్ మండల పరిధిలోని మాల్యం గ్రామంలో వెలిసిన శ్రీ కల్లేశ్వర స్వామి టెంపుల్ డెవలప్మెంట్ కోసం అనంతపురం ఎండోమెంట్ ఏఈ మేడం హరిత, ఏవో దేవదాస్, బసవేశ్వర స్వామి, టెంపుల్ గోపురం ఎస్టిమేషన్ కోసం విజిట్ చేశారు. ధర్మకర్త గాజుల విజయ్ చంద్రశేఖర్ గౌడ్, శరభన గౌడ్, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.